# దొంగ ఎవరు?

**"మేడం..నావి కన్పించటం లేదు" క్లాస్ జరుగుతుండగా గట్టిగా అరిచింది అరవింద.**

**"ఏం? కన్పించటం లేదు?" లెస్సన్ ఆపి చిరాగ్గా అడిగింది మేడం.**

"రింగ్..ఇయర్ హ్యాంగింగ్స్ కన్పించటం లేదు" ఏడ్పుగొంతుతో అంది.

ఎలా పోయాయి? ఎక్కడ పోయాయి? ఎప్పుడు పోయాయి? ఎవరు తీశారు? రకరకాల ప్రశ్నలతో గోలగోలగా తయారయ్యింది క్లాస్‌రూం.

"వంటి మీదుండాల్సిన నగలు ఎలా పోయాయి?" అరవింద డెస్క్ దగ్గరకొచ్చి కళ్ళతోనే క్లాసంతా కలయ జూస్తూ అడిగింది.

"షాంపూ చేసుకోవడానికి తీసి బ్యాగ్‌లో వేశాను మేడం! పెట్టుకొనే టైం లేక అలానే క్లాసుకొచ్చాను. సెకెండవర్లో కూడా బ్యాగులో వున్నాయి. అవి లాస్ట్ మంత్ నా బర్త్‌డే గిఫ్టుగా డాడీ ఇచ్చారు మేడం" కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

మేడంకి ఏం చేయాలో అర్థం కాలేదు. పెద్దవాళ్ళతో వ్యవహారం. దొంగ ఇక్కడే..ఈ రూంలోనే వున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. కానీ ఎలా? ఎలా పట్టుకోటం? ఎవర్ని నిలదీయటం? భారంగా నిట్టూర్చింది.

అదో కార్పొరేట్ కాలేజీ! అక్కడంతా లక్షాధికార్ల ముద్దుల కూతుళ్ళు..కోటీశ్వర్ల గారాల పట్టిలు చదువు'కొన'టానికి వచ్చారు. వాన కురవకుండానే విరిసిన హరివిల్లులా వుంటుంది ఆ క్యాంపస్ వారి రంగు రంగుల కాస్ట్లీ డ్రస్సెస్‌తో. అచ్చు మొబైల్ గార్డెన్‌లా వుంటుంది ఆ ఆవరణ.

ఆ వాతావరణంలోనూ చిన్న చిన్న దొంగతనాలు జరిగిపోతూనే వున్నాయి. ఎవర్నీ వేలెత్తి చూపే సాహసం చేయలేం..ఎవర్నీ అనుమానించే పరిస్థితీ లేదు. అందరూ డబ్బులో మునిగి తేలే వారే..ఐశ్వర్యంలో పుట్టిన అదృష్టవంతులే. కానీ నోట్ బుక్ పోయిందనో..చెప్పులు కన్పించటం లేదనో..పుస్తకంలో పెట్టిన ఐదొందల నోట్ మాయమయ్యిందనో కంప్లయింట్సు. ఆఖరికి బాత్రూంలో వుండే ప్లాస్టిక్ బక్కెట్‌క్కూడా కాళ్ళొస్తుంటాయి.

ఇక్కడందరూ లక్ష్మీదేవికి అనుంగు పుత్రికలే. గొప్పవాళ్ళందరికీ గొప్ప బుద్ధులుండవనటానికి ఇవన్నీ కొన్ని నిదర్శనలు. కానీ ఇప్పుడు పోయింది మామూలు వస్తువుకాదు. విలువైన బంగారు వస్తువులు.

డబ్బు..హోదా..పలుకుబడి అన్నీ వున్నా కాలేజీ స్థాయికొచ్చిన తర్వాత కూసింత సంస్కారం..కూసింత సోషల్ బిహేవియర్ నేర్చుకోవాలి. బాబుల బ్యాగ్రౌండ్సు చెప్పి అర్భకుల్ని భయపెట్టే రౌడీ అమ్మాయిలు సైతం ఇలాంటి పనులు చేయటానికి వెనుకాడ్డం లేదు.



"అరవిందా! ప్రిన్సిపాల్‌గారికి ఒక కంప్లైంట్ రానివ్వు" తన బాధ్యతగా చెప్పింది. అంతకంటే ఎలా చెప్పాలో తెలీలేదు. వాళ్ళతో మాట్లాడ్డం కత్తి మీద సాము లాంటిదని ఎన్నో సంఘటనలతో అనుభవ పూర్వకంగా తెలుసుకున్న మేడం బుజ్జగించి జోలపాడుతోంది.

లంచ్‌బ్రేక్ తర్వాత క్లాస్‌రూంకి రాగానే "అరవిందా దొరికాయా?" అడిగింది.

"లేదు మేడం.." ఎర్రబడ్డ కళ్ళతో చెప్పింది.

కొద్దిసేపు మౌనంగా వుండిపోయింది మేడం. హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినదానిలా "ఆ..అన్నట్టు మీకీ సంగతి తెలీదు కదూ!"

ఏ సంగతి అన్నట్టు అంతా ఆసక్తిగా చూడసాగారు.

"టూ ఇయర్స్ బ్యాక్ ఏం జరిగిందంటే! కల్పన అనే అమ్మాయిది గోల్డ్‌చైన్ పోయింది. సరిగ్గా ఇలానే ఎవరూ మాకు దొరకలేదన్నారు. అప్పుడు ప్రిన్సిపాల్‌గారు ఏం చేశారో తెలుసా" అందర్నీ ఓసారి కలియచూసింది.

"ఏం చేశారు..ప్రిన్సిపాల్‌గారు దొంగని పట్టేశారా?" అంతా క్యూరియస్‌గా అడిగారు.

"హిప్నాటిస్ట్‌ని పిలిపించారు. ఆయన అందర్నీ హిప్నటైజ్ చేశారు. అంతే గొలుసు ఎవరు తీశారో వెంటనే తెలిసిపోయింది."

అందరూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూశారు.

"ఆ అమ్మాయిని ప్రతి క్లాస్ రూంకి తీసికెళ్ళి దొంగగా పరిచయం చేశారు. ఆ తర్వాత అమ్మాయి కాలేజి మానేసింది. అది వేరే విషయం.

"చూడండి గాళ్స్! అరవింద నగలు మీలో ఎవరికైనా పొరబాటున దొరికినట్టయితే ప్లీజ్ ఇచ్చేయ్యండి! తెలిసో తెలియకో దొరికిన, వస్తువే కదా అనుకోవచ్చు. మీరు చిన్నపిల్లలు కదా! అలా అనుకునే అవకాశం వుంది. అవి బర్త్‌డే గిఫ్టట. సెంటిమెంటుగా ఫీలవుతోంది" వాళ్ళని మెల్లగా దువ్వింది.

ఈసారి ఆయన్ని పిలుద్దాం అన్నారు ప్రిన్సిపాల్ గారు. సాయంత్రం ఏడుగంటలలోపు అవి దొరికితే సరే. లేదంటే హిప్నటైజ్ కావటానికి రెడీగా వుండండి" ఆమె లెసన్ బిగిన్ చేసింది.

సాయంత్రం స్టడీ అవర్స్‌లో ఏడులోపే 'సారీ' అని రాసిన పేపర్‌లో ఇయర్ హ్యాంగింగ్స్ చుట్టిన పేపర్ వుండ అరవింద ముందు పడివుంది. అరవింద ఆనందానికి అంతు లేదు.

దొంగ తెలివికి ఆశ్చర్యపోయినా..తను కల్పించి చెప్పిన కల్పన..హిప్నాటిస్ట్‌ల కథవల్ల దొంగ దొరక్కపోయినా వస్తువులు దొరికాయి అది చాలు అనుకొంది ఆలోచనలో మేడం.

**-కె.విజయలక్ష్మి (బాపట్ల)**